క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఆశీర్వచనాలు


ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న స్వామి వివేకాంద సంస్థ విద్యార్థులు

దాబాగార్డెన్స్: భీమిలి నియోజకవర్గంలో గల అప్పలాచార్య ఆశ్రమంలో ఆదివారం పాతనగరానికి చెందిన స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆశ్రమంలో సంకీర్తన నిర్వహించారు. పీఠాధిపతి రామన్న దంపతులు ఆశీర్వాదం పొందారు. పిల్లల్లో భక్తిభావన పెంపొందించేందుకు ప్రతి నెలా ఓ ఆశ్రమంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పాదపూజ


లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాస్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు

సీతంపేట: శ్రీలలితా పీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పాదచరణాలకు భక్తులు పాదపూజ నిర్వహించారు. లలితానగర్‌లోని పీఠం దర్బారు హాల్‌లో ఆదివారం ఉదయం పండితుల వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో పాదపూజ చేశారు. అనంతరం స్వామీజీ భక్తులను ఆశీర్వదించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి దర్శనం కోసం విచ్చేశారు. పలువురు భక్తులు మంత్రోపదేశం తీసుకున్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన ఘంటసాల గానావధానం

సీతంపేట: ఘంటశాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వైద్యుడు సయ్యద్ రహమతుల్లా నిర్వహణలో గాయనీగాయకులు పాత పాటలను మధురంగా పాడారు. టెలిగ్రామ్ గ్రూప్ సభ్యులు రెండు గ్రూపులుగా ఏర్పడి పాటలకు లయబద్ధంగా స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆనంద పరవశులను చేశారు. సోమయాజుల సత్యవాణి, హెచ్.సావిత్రి, సిహెచ్ నందగోపాల్ ప్రదర్శించిన ఘంటసాల లఘు నాటికలు ప్రేక్షకులను మైమరపింపజేశాయి.

రెచ్చిపోతున్న ఈవ్‌టీజర్లు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సెంట్రల్ పార్క్ ఏరియా
- విద్యార్థినులు, మహిళల బెంబేలు


ఇటీవల ఆర్టీసీ కాంప్లెక్స్ దరి సెంట్రల్ పార్కు వద్ద మహిళపై దాడి చేస్తున్న దుండగులు (ఫైల్)


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్: ఆకతాయిల బెడద మహిళలను బెంబేలెత్తిస్తోంది. ఈవ్ టీజర్ల ఆరాచకాలు మితిమీరుతున్నాయి. స్కూళ్లు, కాలేజీలు, బస్టాపుల వద్ద వారు హద్దులు దాటి ప్రవర్తిస్తున్నారు. దీంతో విద్యార్థినులు, యువతులు ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆకతాయిల చేష్టలతో అవస్థలు పడుతున్న విద్యార్థినులు, మహిళలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితికి గురవుతున్నారు. అడపా దడపా తప్ప పోలీసుల చర్యలు పకడ్బందీగా లేకపోవడంతో ఈవ్ టీజర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చెప్పుకుంటే నలుగురిలో నవ్వుల పాలవుతామనే భయంతో బాధితులు మౌనంగా ఉండిపోతున్నారు. నగరంలోని దక్షిణ నియోజకవర్గం పరిధిలో అనేక కళాశాలలు, పాఠశాలలు ఉన్న విషయం తెలిసిందే. ఉదయం విద్యాసంస్థలకు వెళ్తున్నప్పుడు, స్కూల్/కళాశాలలు ముగిశాక తిరిగి వెళ్లిపోతున్న సమయంలోను ఆకతాయిలు వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు.


దొంగలకు అడ్డాగా మారిన సెంట్రల్ పార్కు ప్రాంతం

అమ్మాయిల వెంట పడి వేధించడం, మద్యం తాగి ఏడిపించడం, శృతి మించి ప్రవర్తించడం నిత్యకృత్యమైపోయింది. పాత జైల్‌రోడ్డులో గల ప్రభుత్వ మహిళా కళాశాలకు వేల సంఖ్యలో అమ్మాయిలు, యువతులు వెళ్తుంటారు. కొంత మంది ఆకతాయిలు పాత జైల్‌రోడ్డు, ఎల్ఐసీ అంబేడ్కర్ బస్టాప్, ఆర్టీసీ కాంప్లెక్స్ బస్టాప్‌ల వద్ద మాటు వేసి వారిని వేధిస్తున్నారు.

స్కూళ్ల వద్ద రక్షణేది..?

ప్రభుత్వ స్కూళ్లకు సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో సాయంత్రమైతే ఆకతాయిలు పాఠశాలల ఆవరణలోను, సమీపంలోను వేచి ఉండి అల్లరి చేస్తున్నారు. మందు బాబులు మద్యం సేవించడం.. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం వంటివి చేస్తున్నారు. ఈవ్ టీజర్లను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెప్పడం ప్రకటనలకే పరిమితమం అవుతుందనే ఆరోపణ లున్నాయి. ప్రధాన జంక్షన్లలో పోలీసులు ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలు కూడా ఆటకెక్కాయి.

విద్యార్థులే కాదు.. వారి తల్లులకు కూడా..

విద్యార్థినులే కాక మహిళలు, తమ పిల్లల కోసం స్కూళ్లు/కాలేజీలకు వచ్చే తల్లులు కూడా ఈవ్ టీజర్ల వెకిలి చేష్టలకు ఇబ్బంది పడుతున్నారు. ఈవ్ టీజర్ల ఆగడాలకు భయపడి కొంత మంది విద్యార్థినులు స్కూళ్లకు రావడానికి కూడా భయపడతున్నట్టుగా చెబుతున్నారు.

ఒంటరిగా కనిపిస్తే అంతే..

పోలీసుల గస్తీ కొరవడడంతో రాత్రి 11 గంటలు దాటితే ఒంటరిగా నడిచి వెళ్లాలన్నా, బైక్‌లపై వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి దాపురించింది. బైక్‌లతో చీకటిగా ఉండే ప్రాంతాల్లో మాటువేసి ఒంటరిగా నడిచి వచ్చే వారిని, బైక్‌పై వెళ్లే వారిపై మూకుమ్మడిగా దాడులు.. దోపిడీలకు పాల్పడతున్నారు. ఎవరైనా ప్రతిఘటిస్తే వారిపై దాడికి సిద్ధపడతున్నారు. వారం.. పది రోజుల కిందట పాత జైలురోడ్డు వద్ద రాత్రి 11 గంటల సమయంలో ఓ


మందుబాబులకు అడ్డాగా మారిన సెంట్రల్ పార్కు ప్రాంతం

మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి పరారయ్యారు. మూడు రోజుల కిందట ఇద్దరు వ్యక్తులు వాకింగ్ (రాత్రి సమయంలో) చేస్తుండగా దాడి చేసి పరారయ్యారు. ఈ విషయంపై రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోలేదనే ఆరోపణ సాక్షి దృష్టికి వచ్చింది.

వీధి దీపాలు వెలగవు..

ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగవు. ఒకవేళ విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టినా అవి తాత్కాలికమే. ఎందుకంటే ఈ ఆకతాయిలు వీధి దీపాలను పగులగొట్టేస్తూ దారి దోపిడీలు.. నేరాలకు పాల్పడుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..

రాత్రి వేళల్లో ఏ పని లేకపోయినా ఫుడ్‌కోర్టుకి అని చెప్పి చెడు తిరుగుళ్లు తిరుగుతున్నారు. ఇదే అదనుగా కొంత మంది ట్రాన్స్‌జెండర్లు.. దొంగలు దారి కాసి దాడులకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై చర్యలు తీసుకుంటున్నాం. నిఘా పెట్టాం. ఈవ్ టీజింగ్‌కి సంబంధించి ప్రస్తుతానికి ఫిర్యాదులు అందలేదు. వాటిపై కూడా దృష్టి పెట్టాం.

–బి తిరుమలరావు, స్టేషన్ హౌస్ ఆఫీసర్, రెండో పట్టణ పోలీస్ స్టేషన్

ఘనంగా ఆదిశక్తి అమ్మవారి జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అల్లిపురం: కొబ్బరితోట వాసుల ఆరాధ్య దైవం స్వయంభూ ఆదిశక్తి అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారు జాము నుంచి పూజలు నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులకు పలు స్వచ్ఛంధ సంస్థలు మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంతో పాటు కొబ్బరితోట వీధులన్నీ రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

కేంద్రం ఆంక్షలతోనే స్టీల్‌ప్లాంట్‌కు దుస్థితి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం పగబట్టిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు బి.మల్లయ్య, తౌడన్న ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 1228వ రోజు దీక్షా శిబిరంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గనులు లేకపోయినా సామర్థ్యానికి మించి ఉత్పత్తులు సాధించిన ఘన కీర్తి విశాఖ ఉక్కు సొంతమన్నారు. విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని పెంచేందుకు డీపీఆర్ సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో కేంద్రం తన అనుయాయులకు కర్మాగారాన్ని అప్పగించాలనే కుట్రతో విష ప్రచారం మొదలు పెట్టి ప్రైవేటీకరణకు తెరలేపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో విశాఖ ఉక్కును కొనసాగిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కర్మాగారం కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరుల త్యాగానికి ఫలితం ఉంటుందని, వేలాది ఎకరాలు నామమాత్రపు ధరకు అప్పగించిన నిర్వాసితుల త్యాగానికి గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, శ్రీనివాసనాయుడు, పుల్లారావు, విళ్లా రామ్మోహన్ కుమార్, ఎల్.వి. రమణ పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో మల్లయ్య, తౌడన్న, ఆదినారాయణ

విమల విద్యాలయం ఉపాధ్యాయుల దీక్షకు మద్దతు

ఉక్కునగరం: స్థానిక విమల విద్యాలయం ఉపాధ్యాయులకు పాఠశాల పూర్వ విద్యార్థులు మద్దతు తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ యాజమాన్యం, పాఠశాల యాజమాన్యం మధ్య జరిగిన ఒప్పందం కాల పరిమితి ముగియడంతో కొత్త ఒప్పందం చేయాల్సి ఉంది. అయితే ఇరువర్గాల మధ్య ఒప్పందం జరగకపోవడంతో ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవడం లేదు. అప్పటి నుంచి ఉపాధ్యాయులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల వద్ద ఉపాధ్యాయులను కలిసి తాము అండగా ఉంటామన్నారు. ఎన్నో వేల మందిని తీర్చిదిద్దిన పాఠశాల ఉపాధ్యాయులకు నష్టం జరిగితే సహించబోమన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లవిల్లి కనక భవాని, రామ్మోహన్‌కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు మద్దతు తెలుపుతున్న పూర్వ విద్యార్థులు

రక్షక్ డ్రైవర్‌కు ద్వారకా పోలీసుల ఆర్థిక సాయం

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో కుమార్తెను కోల్పోయిన కమ్యూనిటీ హోం గార్డు డ్రైవర్ కుటుంబానికి ద్వారకా స్టేషన్ పోలీసులు బాసటగా నిలిచారు. ఈ స్టేషన్ రక్షక్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న బి.సురేష్ కంచరపాలెం జాషువానగర్‌లో భార్య, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి సురేష్ తన కుమార్తె పూజిత(9)తో కలిసి రైల్వే న్యూకాలనీ వెళ్లి తిరిగి వస్తుండగా తాటిచెట్లపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మరణించడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో సురేష్ కుటుంబానికి ద్వారకా జోన్ పోలీస్ అధికారులు, సిబ్బంది ఆర్థిక సాయం చేశారు. ఆదివారం స్టేషన్‌లో ద్వారకా సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, శ్రీను, సిబ్బంది రూ.30 వేలను సురేష్‌కు అందించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ డి.వి.రత్నం, హెచ్‌సీలు శంకర్, కె.శ్రీను, సిహెచ్.శ్రీను, రామ్మూర్తిరాజు, పీసీలు ఎస్.రమేష్, కె.టి.వి.రమేష్, శ్రావణి పాల్గొన్నారు.


సురేష్‌కు రూ.30 వేలు అందజేస్తున్న సీఐ రమేష్, ఎస్‌ఐలు, సిబ్బంది

ముస్లింల వివాహ వేదికకు అనూహ్య స్పందన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్ఎన్ కాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ఆదివారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖ ఆధ్వర్యంలో ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలతోపాటు విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు ముస్లింలు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి తమ పిల్లలకు సంబంధాలను కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఆరు సార్లు ఉచిత వివాహ పరిచయ వేదికలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం ఏడో వేదికను నిర్వహించామన్నారు. వీటి ద్వారా ఇప్పటి వరకు చాలా మంది వివాహాలు చేసుకుని ఒక్కటయ్యారని చెప్పారు. ఇది పూర్తిగా ఉచిత సేవ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వేరే ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా భోజన ఏర్పాట్లు చేశామన్నారు. పేద ముస్లింలకు తమ సొసైటీ తరపున షాదీ ఖర్చులు భరించి, ఉచితంగా వివాహాలు కూడా జరిపిస్తున్నామని సింకా తెలిపారు. ఈ కార్యక్రమాలకు అనూహ్య స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్‌ను సొసైటీ సభ్యులు సత్కరించారు. కమిటీ సభ్యులు మీర్ అబ్బాస్ హుస్సేన్, సయ్యద్ అమీర్ జాన్, హమబూబ్ ఆలీఖాన్, షేక్ అహ్మద్ వల్లి, షేక్ అబ్దుల్ మునీర్, మహ్మద్ హబీబ్, హాజీ రహ్మతుల్లా, మెహబూబ్ షరీఫ్, మహ్మద్ లుక్మాస్, అస్గర్ ఆలీ, ముస్లిం కుటుంబాలు పాల్గొన్నాయి.


మాట్లాడుతున్న హైదర్ ఆలీ సింకా

నిరాశ్రయులకు ఆపన్న హస్తం

- వృద్ధులను అక్కున చేర్చుకుంటున్న రెడ్ క్రాస్ సొసైటీ
- మానసిక వికలాంగులకు విలువైన సేవలు

ఎంవీపీ కాలనీ: నిరాశ్రయులకు జీవీఎంసీ 17వ వార్డులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విలువైన సేవలు అందిస్తోంది. పట్టణ నిరాశ్రయుల వసతి గృహం పేరిట బాధితులకు ఆశ్రయమిస్తూ అక్కున చేర్చుకుంటోంది. జీవీఎంసీ, జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్ అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుంటూ నిర్భాగ్యులకు అండగా నిలుస్తోంది. అన్ని వేళలా నిరాశ్రయులకు ఆపన్న హస్తం అందిస్తూ నగరవాసుల మన్ననలు అందుకుంటోంది.

2018 నుంచి నిర్విరామ సేవలు

జీవీఎంసీ 17వ వార్డులో 2018 జులైలో ఇండియన్ రెడ్ క్రాస్ సెంటర్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ సెంటర్‌లో 20 మంది ఆశ్రయం పొందేందుకు వీలుండగా.. ప్రస్తుతం 26 మంది నిరాశ్రయులు ఉన్నారు. వారి అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం, ఆహారం అందించడంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా షెల్టర్ నిర్వాహకులు విలువైన సేవలు అందిస్తున్నారు. నగరంలో ఎక్కడ నిరాశ్రయులు ఉన్నా, పోలీసుల దృష్టికి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినా ఈ సొసైటీ వారిని అక్కున చేర్చుకుంటుంది. కుటుంబ సపోర్టు లభించక అనాథలైన వారు, ఆత్మహత్యకు పాల్పడేందుకు సాగరతీరానికి వచ్చే వారు, మానసిక రుగ్మతలతో రోడ్డున పడే వారు ఇలా ఎందరికో ఆశ్రయమిస్తున్నారు.


షెల్టర్‌లో సేదదీరుతున్న నిరాశ్రయులు


7వ వార్డులోని రెడ్‌క్రాస్ సొసైటీ షెల్టర్

అప్రమత్తతతో వ్యాధులకు చెక్

జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్



జగదాంబ: వర్షా కాలం వ్యాధుల ముప్పు పొంచి ఉంది. డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో జీవీఎంసీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక వైద్య బృందాలు యాంటీ ల్వార్వా ఆపరేషన్లు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాధులకు చెక్ పెట్టేందుకు తీసుకుంటున్న చర్యలను జోన్–4 అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి రాజేష్ వివరించారు.

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పలు చర్యలు..

ముందుగా వార్డుల్లో మురుగు కాలువలు, గెడ్డలు శుభ్రం చేయిస్తున్నాం. ఎక్కడైనా నీటి ప్రవాహంలో అడ్డంకులు ఉంటే పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తున్నాం. నీరు ఆగకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీని వల్ల దోమల వృద్ధిని అరికట్టవచ్చు. తద్వారా వ్యాధుల తీవ్రత తగ్గుతుంది.

అవగాహనతోనే వ్యాధులకు అడ్డుకట్ట..

వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు వార్డుల్లో ఆటోల ద్వారా ప్రచారం చేయిస్తున్నాం. మలేరియా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిల్వ నీరు, పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరిబొండాల వంటివి పరిసర ప్రాంతాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేస్తున్నారు.

యాంటీ లార్వా ఆపరేషన్లతో దోమలకు చెక్..

జోన్ పరిధి అన్ని వార్డుల్లో నిత్యం ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇళ్లలోని ఫ్రిజ్‌ల వెనుక నీరు నిల్వ ఉండకూడదని అవగాహన కల్పిస్తున్నాం. అలాగే యాంటీ లార్వా ఆపరేషన్లు చేయిస్తున్నాం. బావులు, వాటర్ ట్యాంకుల్లో దోమ నివారణ మందులు వేస్తున్నాం. ఫాగింగ్ ద్వారా కాలనీల్లో దోమల వృద్ధిని అరికడుతున్నాం.

వైద్య సిబ్బంది తీసుకుంటున్న చర్యలు..

మెడికల్ సిబ్బంది రోజు ఇంటింటి పర్యటనలు చేస్తున్నారు. ఎవరికైనా జ్వరాలు ఉంటే వెంటనే ప్రథమ చికిత్స అందించి, సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తున్నారు. ఏఎన్ఎంలు దగ్గరుండీ ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. మందులు ఇస్తున్నారు. వార్డుల్లో ఎక్కడైనా డెంగ్యూ తదితర వ్యాధులు సోకితే వెంటనే పరిసరాల్లోని కిలోమీటరు పరిధి వరకు బ్లీచింగ్ చేయడం, ఫినాయిల్ జల్లడంతో పాటు వ్యాధి ప్రబలకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

జ్వరం వస్తే అశ్రద్ధ చేయొద్దు..

ఎవరికైనా సాధారణ జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకూడదు. సమీపంలో అందుబాటులో ఉన్న ఏఎన్ఎం వద్దకు లేదా ఆస్పత్రికి వెళ్లాలి. క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలి. ప్లేట్‌లెట్స్ తగ్గకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలి. పండ్లు, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. ఫ్రిజ్‌లో ఉండే ఆహార పదార్థాలు తీసుకోకూడదు. జోన్ పరిధిలో ఎక్కడైనా దోమలు ఎక్కువగా ఉంటే వెంటనే జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే వెంటనే సిబ్బంది ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్ చేయడంతో పాటు యాంటీ లార్వా ఆపరేషన్లు చేస్తారు.

ఇరుకు గదుల్లో రెండు స్టేషన్లు

- ఫోర్త్‌టౌన్, ద్వారకా పీఎస్‌ల పరిస్థితి ఇది
- ఇబ్బందులు పడుతున్న పోలీస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు

సీతమ్మధార: నగరంలోనే అది ఎంతో కీలకమైన పోలీస్ స్టేషన్. దీని పరిధిలో ఎంతో మంది వీఐపీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నివసిస్తున్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ మేడ మీదే ద్వారకా జోన్ స్టేషన్ కూడా నిర్వహించడం తెలిసిందే. రెండు స్టేషన్లలోనూ శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్రైం విభాగాలు ఉన్నాయి. ఫోర్త్‌టౌన్ స్టేషన్‌లో శాంతి భద్రతల విభాగంలో 51 మంది, ద్వారకా స్టేషన్‌లో 62 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇరుకు గదులు కావడంతో ఫిర్యాదుల స్వీకరణ, ఫిర్యాదుదారులు, నిందితుల విచారణ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదిలో వేచి ఉండలేక, ఉన్నతాధికారులు వచ్చే వరకు ఫిర్యాదుదారులు స్టేషన్ ఆవరణలోను, రోడ్డు మీదనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

స్థలం లేక రోడ్డు మీదే పార్కింగ్

ఈ స్టేషన్ల ఆవరణలో తగినంత స్థలం లేకపోవడంతో ఉన్నతాధికారులు రాకపోకలు సాగించే వాహనాలను కూడా రోడ్డు మీదే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి. పలు కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలు కూడా స్టేషన్ ఆవరణలోనే పేరుకుపోవడం గమనార్హం. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు కూడా ఏది ఫోర్త్‌టౌన్, ఏది ద్వారకా పోలీస్ స్టేషన్ అన్నది సులభంగా గుర్తించలేక తికమకపడుతున్నారు.

అధిక సంఖ్యలో ఫిర్యాదుదారుల తాకిడి

ఫోర్త్‌టౌన్ పరిధిలో అక్కయ్యపాలెం, దొండపర్తి, కైలాసపురం, తాటిచెట్లపాలెం, లలితానగర్, సీతమ్మధార, రైల్వే న్యూకాలనీ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ద్వారకానగర్, అశోక్‌నగర్, రామాటాకీస్, ఆశీలమెట్ట, సీతంపేట, గురుద్వారా, శాంతిపురం తదితర ప్రాంతాలు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. దీంతో నిత్యం రెండు స్టేషన్లకు అధిక సంఖ్యలో ఫిర్యాదుదారులు పలు కేసుల నిమిత్తం వస్తుంటారు. ద్వారకా స్టేషన్ పరిధిలో వైట్‌కాలర్ నేరాలు ఎక్కువగా నమోదవుతుంటాయి. ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా గొడవలు, దొంగతనాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో సిబ్బంది ఫిర్యాదుదారులకు సేవలు అందించడానికి గాను విశాలమైన గదులు లేక ఇబ్బందికరంగా ఉంటుంది. పలు కేసులకు సంబంధించి సీజ్ చేసిన సామగ్రి కూడా గదులను ఆక్రమిస్తున్నాయి. ఈ కారణంగా ఇటు సిబ్బంది.. అటు ఫిర్యాదుదారులు ఇక్కట్లు పడుతున్నారు.



ఫోర్త్‌టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్లు

పైడిమాంబ అమ్మవారి జాతర ప్రారంభం


రామకృష్ణాపురంలో పైడిమాంబ అమ్మవారు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని ఇప్పటికే ముస్తాబు చేశారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలు కోసం ఆదివారం ఉదయం గ్రామంలో చాటింపు వేయించారు. ఇందులో భాగంగా అమ్మవారిని గ్రామస్తులు దర్శించుకుని పూజలు చేశారు. మొదటి రోజు బుర్రకథ నిర్వహించారు. సోమవారం కూచిపూడి నృత్యం, మంగళవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు తెలిపారు.